ఆకలి కేకలకు
తట్టుకోలేక
పతితగా మారిన
ఆమె కథ?

# మజిలీ

పగిడిపాల
ఆంజనేయులు
కథ

“బాబూ! ఈ రైలు క్షేమంగా చేరుతుందంటావా?”

అప్పటికి పదోసారడిగిన పెద్దాయన ప్రశ్నకి విసుక్కుంటూ, సిగరెట్టు ఆఖరి దమ్ము లాగి నలిపేశాడు సందీప్ కసిగా.

“ఇంకొద్ది క్షణాల్లో పక్క కంపార్ట్‌మెంట్‌లో బాంబు పేలబోతోందండీ... మనమంతా బూడిదైపోతాంట!”

అతడు పేలిన మాటలకి జనం ఎలర్టయ్యారు!

“ట్రైన్ ఎక్కిందగ్గర్నుండీ ఒహటే నస మొదలెట్టారీయన ఎందుకో ఈయనగారికి జీవితమ్మీద అంత ఆశ?”

జనాన్నుద్దేశించి 'ప్రమాదమేదీ లేదని' చెప్పాడు. ప్రయాణికులు ఆ షాక్‌నుండి తేరుకునేసరికి పావుగంట పైనే పట్టింది.

“మతోన్మాదులూ, అరాచకవాదూలూ, దేశద్రోహులూ, నగరాల్లో, రైళ్లలో, విశృంఖలంగా పేల్చుతోన్న బాంబు పేలుళ్లలో ఎందరో నిర్జీవులై, నిరాశ్రయులై, అనాధలై, అవిటివారై....”

“రఘుపతి రాఘవ రాజారాం.

... ... ...

ఈశ్వర్ అల్లా తేరేనామ్

... ... ...”

పెద్దాయన మాటలకన్నా బిచ్చగాడి పాట ఆ కంపార్ట్‌మెంట్‌లో గంభీరంగా విన్పించింది!

ఐదు నిమిషాల తర్వాత ఆ బిచ్చగాడు మరో కంపార్ట్‌మెంట్‌లోకెళ్లాడు.

పెద్దాయన మాటలు మొదలయ్యాయి!

“అందర్నీ పోగొట్టుకున్న అనాధని నాకు



జీవితంమీద ఆశా, అనురక్తీ ఎక్కడుంటా యి బాబూ!

మొన్నటికి మొన్న భూమి గర్జించి లక్షలమందినీ పొట్టన బెట్టుకుంది. శవాల్ని కాల్చేందుకు స్మశానమే కరువైంది!

అది ప్రకృతి వైపరీత్యమని విషాధాన్ని మింగుకోవచ్చు. కానీ ఈ బాంబు విస్ఫోటనా ల్ని ఏ వైపరీత్యమని జీర్ణించుకోవాలయ్యా?

అందమైన కాశ్మీరం ఉగ్రవాదుల నిలయమైంది. అక్కడి అందాలు రక్తంతో తడిచిపోయినాయి... కానీ అంతకంటే భయంకరమేంటో తెల్సా 'ఎయిడ్స్‌ని జనంలోకి ప్రవేశపెట్టడం!'

ఇవన్నీ విన్పిస్తోంటే వళ్లు గగుర్పొడుస్తుందయ్యా!''

పెద్దాయనలోని ఆవేదనకీ, ఆవేశానికీ ప్రయాణికులు చలించిపోయారు. సందీప్ కళ్లు అప్రయత్నంగా తడయ్యాయి!

నిశితంగా ఆయనవైపు చూశాడు. శరీరం వయస్సు భారంతో ముడుతలు పడుతోన్నా, వదనంలో జ్ఞాన వీచికలు కదలాడుతున్నాయి.

ఆయన కళ్లు నిర్మలంగా ప్రకాశిస్తున్నాయి! చిక్కటి చీకట్లని చీల్చుకుని గౌతమి ఎక్స్‌ప్రెస్ సాగిపోతోంది గర్జనలా!

''అపార్థం చేసుకున్నాను క్షమించండి!''

స్పష్టంగా చెప్పాడు సందీప్. ఆయన చిన్నగా నవ్వారు.

చిరుగుల చొక్కాతో రైలు డబ్బానంతా శుభ్రం చేస్తోన్న కుర్రాడివైపు చూశారు.

చెయ్యిచాపి మూతి జూపిస్తూ, పొట్టన కొట్టుకున్నాడు వాడు కూటికోసం అన్నట్టు!
''

''రాత్రనకా పగలనకా వీడిలా కష్టపడినా పూటగడవదు... ఆకలి తీరదు. ప్రాణాలు మాత్రం వాడ్ని హింసిస్తాయి!''

వాడు మరో పెట్టెలోకి పోయాడు.

చల్లటిగాలి రివ్వున వీస్తుండడంతో 'శాల్ భుజాలచుట్టూ కప్పుకున్నాడు.

సందీప్!

ట్రైన్ మధిర స్టేషన్లో ఆగింది.

''బాబూ! రక్తపు కాల్వల్లో తడిసిన ఈ మాంసపు ముద్దల్తో వాళ్లు నిర్మించే కోటగోడలేంటో బాగా ఆలోచించయ్యా?''. అంటూ పంచె భుజానేసుకుని దిగిపోయాడు 'పెద్దాయన'

ప్రయాణికులంతా నిద్రకుపక్రమిస్తున్నారు. సందీప్ సిగరెట్ వెలిగించాడు.

o p o

విజయవాడకొచ్చేవరకు అర్ధరాత్రి దాటింది. స్టేషన్‌దాటి బయటకొచ్చాడు సందీప్.

''రిక్షా, రిక్షా...

బాబూ... రిక్షాండి...

సర్ రిక్షా కావాలా...

లాడ్జికెడతారా...''

రిక్షావాళ్ల అరుపులు మొదలయ్యాయప్పుడే!

వీళ్ల అరుపులకి ఆ ట్రైన్ పెద్దాయన ఏమంటారో...

వీళ్లంతా ఇలా అరవకపోతే రేపు వీళ్ల కుటుంబాల్లో ప్రళయం సృష్టిస్తోంది!

వాళ్లనుండి తప్పుకుని రోడ్డెక్కాడతడు.

తెల్లారేందుకింకా గంట వ్యవధి.

కృష్ణానదివైపు నడక సాగించాడు.

ఉదయం ఎగురవేసిన త్రివర్ణ పతాకాలు గాలికిరెపరెపలాడుతూ నియాన్ లైట్ల వెలుతుర్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి!

కాలువ గట్టెంబడి వున్న గుడిసెల ముందు చలిమంటలు లేచాయి. దరిద్రుడి ఆకలి మంటల్లా!'

యధాలాపంగా నడుస్తోన్న అతడు వెనక్కి తిరిగి చూశాడు.

సన్నగా అందెల సవ్వడు... ఆ నిర్మానుష్య నిశ్శబ్దం నిశీధిలోంచి స్పష్టంగా వినిపించింది!

'మిలమిలలాడే యవ్వన కాంతులతో పరిపూర్ణ స్త్రీత్వంతో అందంగా మెరిసిపోతున్న ఆ అమ్మాయి జెండా కర్ర చాటునుంచి బయటికొచ్చింది!

వాజూకైన నడకలో హొయలుపోతూ...

కాంక్షగా పెదాల్ని తడుపుకుంటూ... అతడ్ని సమీపించింది.

ఎవర్నువ్

చెప్పు?

ఈ రాత్రిక్కడేం చేస్తున్నావ్?

కిలకిలమని నవ్వింది!

"నేనెవర్నంటే ఏం చెప్పను మేష్టారూ... కావాలంటే చెప్పండి మీదాన్నవుతాను. ఆ రేటుదేముందిలెద్దూ. మీకు తోచినంత"

ఆమెనుండి తప్పుకుని నడక వేగం పెంచాడు.

తెరలు తెరలుగా ఆమె నవ్వు మంద్రస్థాయిలోకి దిగింది! సందీప్‌కి ఇక్కడ అలాంటి వారుంటారని తెల్సు. కానీ మరీ ఇంతగా తెగించి వుంటారనుకోలేదతడు.

నెమ్మదిగా చీకట్లు కరిగిపోతున్నాయి!

ఓంకారనాదంలా కృష్ణానది ఘోషిస్తోంది!

"నమస్కారం సారూ! మాటయినా చెప్పకుండా వచ్చేరే... నేనొచ్చలేదా. ఆ నచ్చకుండా ఎలా వుంటాన్లెండి. రండి మాస్టారూ...

అసహనంగా ఫీలయ్యాడు.

"త్వరగా తెమలండిసారూ! ఇంకాస్సేపయితే తెల్లారిపోద్ది. ఎంతసేపండీ పది నిమిషాలు... మహా అయితే పావుగంట. మీరు కాబట్టి మరో ఐదు నిమిషాలు!" వేగంగా చెప్పుకుపోతోంది.

అయోమయంలో పడిపోయాడు సందీప్, వయసు పాతిక లోపుంటుందేమో!

## పేపర్

"ఈరోజుదేనాండి పేపర్?"

"కాదు సంవత్సరం క్రితంది దాచుకుని ఇప్పుడు చదువుతున్నా!" గయ్‌మన్నాడా వ్యక్తి.

— మారగాని బదర్స్ (పులివెందుల)



ట్రాన్సిస్టర్‌లోంచి దూరంగా 'చిత్ర' స్వరం విన్పిస్తోంది!

సంధ్య వేళల్లో సూర్యుడూ,

వేకువ జాముల్లో జాబిల్లీ

కనుమరుగవుతాయి, బాధల్ని

ముళ్ళగా మార్చుకున్న రోజాలు నవ్వుతుంటాయి'

ప్రతి ఒక్కరి మనసునీ కదిలించే పాట.

"బెట్టుచేయమాక తొరగా..."

ఆ అమ్మాయి మాటలు మధ్యలోనే ఆగిపోయాయి!

"మాడు వాకలాంటలవాట్లేమీ లేవు... కావాలంటే ఈ డబ్బు తీసుకుని వెళ్లిపో... నన్నిబ్బంది పెట్టక..."

ఆమె చేతిలో విసురుగా ఇరవై నోటుంచి వెనక్కి తిరిగి చూడకుండా పవిత్ర కృష్ణానది లో మునిగాడు!

నియాన్ లైట్లు ఆరిపోయాయి!

ప్రాతఃకాల వెలుతుర్లు విచ్చుకుంటుండడంతో భక్తజనులు పల్చపల్చగా వస్తున్నారు.

తృప్తిగా స్నానంగావించి కనకదుర్గమ్మని దర్శించుకుని వెనుదిరిగాడు సందీప్.

సూర్యుడుదయించాడప్పుడు! దూరంగా కనిపిస్తోన్న పతాకాలు రెపరెపలాడుతూనే వున్నాయి!

గబగబా మెట్లు దిగుతున్న అతడాగిపోయాడు.

"బాబుగారూ!" మొదటి మెట్టు దగ్గర ఆమె నించుని వుంది.

ఊహించని పిలుపుకి విరుత్తరుడయి క్షణకం ఆమెవైపు పరిశీలనగా చూశాడు.

మృదువైన కంఠం జీరవోయింది.

కవ్వించే కళ్ళు ఎర్రపడి ఉబ్బిపోయివై.

పాలుగారే బుగ్గలపై అస్పష్టంగా కన్నీటి చారికలు, తడిపెదాలు పాలిపోయి....

"నా తనువులో జవసత్వాలుడిగిపోలేదు, అందం తగ్గిపోలేదు. మీరు దాతృత్వంతో ఇచ్చిన డబ్బుతో నా కడుపు నిండదు. నేను మిమ్మల్ని ధర్మమని యాచించలేదయ్యా!" చేతులు జోడించింది.

"నో, నీకిచ్చిన డబ్బు నేనెలా వెనక్కి తీసుకుంటాను. ఆ డబ్బు నీదగ్గరే వుంచుకో"

జనం తమవైపే చూస్తుండడంతో ఇరిటేట్ ఫీలయ్యాడు.

"తేరగా వచ్చిన డబ్బు నేనూ పుచ్చుకోలేనండి... దయచేసి మీ డబ్బు మీరు తీసుకోండి" ఆమె గొంతు లోతుగా ధ్వనించింది.

"డబ్బుకోసం మళ్ళీ వృత్తిలోకి దిగావ్. నీక్కావలసింది డబ్బు! ఆ డబ్బు ఎలా వస్తేనేం" నిశితంగా అడిగినా అతడి గొంతు కటువుగానే పలికింది.

"డబ్బుకోసం నేను ఒళ్లమ్ముకోవడంలేదయ్యా!"

ప్రశ్నార్థకంగా చూశాడు సందీప్.

నిశ్శబ్దకాలంలో

దొర్లిపోతోందిద్దరిమధ్యా.

జనం చోద్యం చూస్తూనే వున్నారు.

... ... ...

"ఆకలి! ఆకలికోసం బాబూ!"

ఆమెగొంతు ఆ పరిసరాల్లో ప్రతిధ్వనించి, ఆపై మాటలు పెగలక దుఃఖంతో

మూగవోయింది. కళ్లు అశ్రువుల్ని స్రవిస్తున్నాయి. పవిత్ర కృష్ణవేణి ఘోష భక్తజనుల భక్తిగీతాల్లో కల్సిపోతోంది!

క్షణంపాటు స్తబ్దుడయ్యాడు సందీప్!

ఇప్పుడతని కళ్లూ అశ్రువుల్ని రాల్చుతున్నాయి బొట్లు బొట్లుగా.

అస్పష్టంగా ఆమె కన్పించింది.

లీలగా డ్రైవ్ పెద్దాయనా, బిచ్చగాడూ, కుర్రాడు, రిక్షావాళ్లూ...

వీళ్లంతా దేనికోసం జీవిస్తున్నారు??

ఆమె గుండెలు దుఃఖంతో ఎగిసిపడుతున్నాయి.

చప్పున ఆమె చెయ్యి పట్టుకుని లాక్కుపోతున్న సందీప్ని, ఆమెని జనం చోద్యంగా దిగ్భ్రాంతిగా చూస్తున్నారు. ఆమె వదనంలో అంతర్లీనంగా అందం వెనుక దాక్కున్న విషాదం బయటకొచ్చింది.

"మన ఇరవై వోటుకి పరిష్కారం..." అంటూ హోటల్లోకి దారితీశాదు సందీప్.

ఆమె మనస్సు, కడుపుకన్నా ముందు కృతజ్ఞతని నింపుకుంది.

*

